



వంశధార నదిలో శ్రీముఖలింగేశ్వరుడికి చక్రతీర్థ స్నానం

శ్రీముఖలింగేశ్వరుడికి చక్రతీర్థ స్నానం



వంశధారకు భారీగా తరలి వచ్చిన భక్తులు

చక్రతీర్థ స్నానం ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

దక్షిణ కాశీగా పేరొందిన శ్రీముఖలింగం భక్త జనంతో పులకించింది. వంశధార తీరంలో శివనామస్మరణ మార్మోగింది. మహా శివరాత్రి ముగింపు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీముఖలింగేశ్వరుడు పార్వతీ సమేతంగా ఎల్.ఎన్.పేట మండలం మిరియాపల్లి రేవులో చక్రతీర్థ స్నానమాచరించాడు. ఈ అద్భుత దృశ్యాన్ని తిలకించేందుకు ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. నదిలో స్నానాలు ఆచరించి పునీతులయ్యారు. ముందుగా నంది వాహనంపై ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా నదీ తీరానికి తీసుకువచ్చి.. చక్రతీర్థం అనంతరం యథాస్థానంలో ఉంచి పూజలు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

జలుమూరు/ ఎల్.ఎన్.పేట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి)

6లో

న్యాయ విజ్ఞానాన్ని పెంపొందించాలి

● జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

గుజరాతీపేట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): న్యాయ విజ్ఞానాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు పారాలీగల్ వలంటీర్లు దోహదపడతారని జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా కోర్టు సముదాయంలోని న్యాయ సేవాసదన్‌లో పారా లీగల్ వలంటీర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేలా, న్యాయం అందరికీ అందుబాటులో ఉండేలా పారా లీగల్ వలంటీర్స్ పని చేయాలని కోరారు. అనంతరం వలంటీర్లకు ఆస్తి, కుటుంబ వివాదాలు, క్రిమినల్, తదితర చట్టాలపై శిక్షణ ఇచ్చారు. వారికి గుర్తింపు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

సిక్కోలు.. ఇక అభివృద్ధి పథం

● బడ్జెట్‌లో జిల్లాకు నిధుల వర్షం
● వంశధార ఫేజ్-2కు రూ. 182.53 కోట్లు
● ఆఫ్‌షోర్‌కు మరో రూ.90 కోట్లు కేటాయింపు
● ఈఎస్ఐ ఆసుపత్రికి భూ సేకరణ
● ఎస్సీ, ఎస్టీల ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహకారం

శ్రీకాకుళం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం శుక్రవారం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు అత్యంత ప్రాధాన్యమిచ్చింది. అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ.. బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో విస్మరణకు గురైన ప్రాజెక్టులు పూర్తిచేసేలా నిధులు మంజూరు చేయనుంది. సిక్కోలును అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేలా బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతో ప్రజాప్రతినిధులు, ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది.

● వంశధార.. పరుగులెత్తేలా...

జిల్లాకు జీవనాడి.. వంశధార. గత ఐదేళ్ల వైసీపీ హయాంలో కేవలం ఈ ప్రాజెక్టు పనులు ఐదు శాతం మాత్రమే జరిగాయి. బిల్లుల చెల్లింపులు కూడా ఆలస్యం చేశారు. గతంలో టీడీపీ హయాంలో (2014-19) వంశధార పనులు జోరుగా సాగాయి. ముగింపు దశలో ప్రభుత్వం మారింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ.. వంశధార ప్రాజెక్టు పనులకు ప్రాధాన్యం ఇవ్వలేదు. ఇతర సాగునీటి ప్రాజెక్టుల విషయంలోనూ నిర్లక్ష్యంగానే వ్యవహరించింది. జిల్లాలో అప్పట్లో అసెంబ్లీ స్పీకర్, ఒక రెవెన్యూ మంత్రి, ఒక పశుసంవర్ధక శాఖ మంత్రి ఉన్నా అభివృద్ధి శూన్యం. వంశధార ఫేజ్ 2023-24లో వైసీపీ హయాంలో రూ.98.47 కోట్లు కేటాయించినట్లు చూపారు. అలానే 2024-25 అంచనా బడ్జెట్‌లో రూ.10కోట్లు మంజూరు చేస్తున్నట్లు లెక్కల్లో చూపారు. కానీ మంజూరు చేయలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా 'వంశధారకు ఏకంగా రూ.182.53 కోట్లు కేటాయించింది. దీంతో వంశధార స్టేజ్ -2కు, నేరడి బారేజీ, అండర్ వంశధార ప్రాజెక్టు పనులన్నీ పరుగులెట్టనున్నాయి. పనులు పూర్తయితే సాగునీటి పరంగా జిల్లా సస్యశ్యామలమవుతుంది.

● అంబేడ్కర్ యూనివర్శిటీకి నిధులు

ఎచ్చెర్లలోని అంబేడ్కర్ యూనివర్శిటీకి ఎట్టకేలకు నిధులు కేటాయించారు. గతంలో రూ.5కోట్లు మంజూరు చేశారు. ఇతరత్రా అవసరాలు.. అభివృద్ధి కార్యక్రమంలో కావాల్సిన నిధులు కూడా స్థానికంగా వచ్చిన ఫీజులు.. వాటితోనే సమకూర్చుకుంటున్నారు. ప్రస్తుతం యూనివర్శిటీకి రూ.8.5కోట్లు కేటాయించడంతో నిధుల కొరత తీరనుందని ఆచార్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● సాధారణ ప్రజలకూ లబ్ధి

సూపర్ సిక్స్ హామీలో భాగంగా 2025-26 విద్యా సంవత్సరం

(మిగతా 8వ పేజీలో..)

అన్ని విధాలా లబ్ధి

వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనత నాకు దక్కింది. రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశాం. రైతులకు.. అన్ని విధాలా లబ్ధి చేకూరేలా రాయితీపై విత్తనాల పంపిణీకి రూ.240 కోట్లు, ఎరువులకు రూ.40 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణకు రూ. 219.65 కోట్లు.. రైతులకు వడ్డీలేని రుణాల కోసం రూ.250 కోట్లు, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం అమలుకు రూ. 9400 కోట్లు.. ఉచిత పంటల బీమా కోసం రూ. 1,023 కోట్లు.. ఏకంగా వ్యవసాయ శాఖకు రూ. 12,401.58 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. జిల్లాలో నిరాదరణకు గురైన ఆఫ్‌షోర్, వంశధార ఫేజ్-2 వాటికి రూ.కోట్లల్లో నిధులు వెచ్చించి ప్రాధాన్యం కల్పించాం. సాగునీటి పరంగా జిల్లా అభివృద్ధి చెందనుంది.

- కె.అచ్చెన్నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి

జిల్లాకు మంజూరైన నిధులు ఇలా..

● యూనివర్శిటీకి బడ్జెట్ : (ఉన్నత విద్య విభాగం) (రూ.కోట్లలో)	2023-24లో	2024-25లో	2025-26
అంబేద్కర్ యూనివర్శిటీ - శ్రీకాకుళం	5.54	8	8.5
● ప్రాజెక్టుల వారీగా... (రూ. కోట్లల్లో)			
వంశధార ప్రాజెక్టు స్టేజ్ -1	0.44	1.50	5.00
నేరడి బారేజీ అండర్ వంశధార ప్రాజెక్టు	98.47	10.00	182.53
తోటపల్లి రిజర్వాయర్	13.83	37.85	47.81
మడ్డువలస ప్రాజెక్టు	0.09	0.66	0.66
మహేంద్రతనయ రివర్ ఫ్లడ్ ఫ్లో కాలువ	0.28	23.35	90.60



వంశధార రిజర్వాయర్

ఆఫ్‌షోర్‌కు మళ్లీ నిధులు

గత ఐదేళ్ల ఆఫ్‌షోర్ ప్రాజెక్టు కలగానే ఉంచేశారు. కూటమి ప్రభుత్వం రాగానే తొలిదఫా రూ.30 కోట్లను విడుదల చేసింది. ఇప్పుడు ఏకంగా రూ.90 కోట్లను కేటాయించింది. దీంతో ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పనులు ఇక చకచకగా జరగనున్నాయి. పలాస, ఇచ్ఛాపురం, టెక్కలి నియోజకవర్గాల్లో రైతులకు సాగునీటి కష్టాలు తీరనున్నాయి. జిల్లాలో ఇతర ప్రాజెక్టుల కాలువల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. తోటపల్లి ప్రాజెక్టుకు రూ.47.81కోట్లు, మడ్డువలస ప్రాజెక్టుకు రూ.0.66 కోట్లు, అలాగే వంశధార ఫేజ్-1 పనులకు రూ.5కోట్లు మంజూరు చేశారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

● పూర్తయిన ఏర్పాట్లు ● కేంద్రాల వద్ద 144 సెక్షన్

నరసన్నపేట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. తొలిరోజు ప్రథమ సంవత్సరం విద్యార్థులు 22,789 మంది పరీక్షలు రాయనున్నారు. జిల్లావ్యాప్తంగా 75 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికి గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. పరీక్షల సమయంలో కేంద్రాలకు సమీపంలో ఎటువంటి జిరాక్స్ షాపులు, ఇంటర్‌నెట్ కేంద్రాలు తెరవరాదని స్పష్టం చేశారు. నరసన్నపేట, శ్రీకాకుళం, ఎచ్చెర్ల, కళింగపట్నం, ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ, పోలాకి, ప్రియాగ్రహారం, జలుమూరు, సారవకోట, పాతపట్నం, కింతలి, టెక్కలి, నందిగాం, నౌపడ, పూండి, రణస్థలం, కొయ్యాం, సింగుపురం, జి.సిగడాం, ఆమదాలవలస, బూర్జ, హిరమండలం, కొత్తూరు, మెళియపుట్టి, కంచిలి, సోంపేట, బారువ, ఇచ్ఛాపురం, తొగరాం, మందస, సరుబుజ్జిలి, కోటబొమ్మాళిలో పరీక్షా కేంద్రాలు కేటాయించారు. తొగరాం, కొయ్యాం, ప్రియాగ్రహారం, జి.సిగడాం తదితర పరీక్షా కేంద్రాలకు ప్రజా రవాణా వ్యవస్థను అందుబాటులో ఉంచాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



నరసన్నపేటలోని పరీక్ష కేంద్రం వద్ద ఏర్పాట్లు

ప్రభుత్వ పాఠశాలల్లో కొత్త మెనూ

● నేటి నుంచి అమలు
● విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యమిచ్చేలా మార్పులు



ఇచ్ఛాపురం/ సంతబొమ్మాళి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మరింత నాణ్యంగా అందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తూ శనివారం నుంచి కొత్త మెనూ అమలు చేయనుంది. ప్రతి జిల్లాలో వంటకాలు, విద్యార్థుల అభిరుచులు, పోషకాలకు పెద్దపీట వేస్తూ జాబితాను సిద్ధం చేసింది. మొత్తం నాలుగు జోన్లుగా విడదీసింది. జోన్-1లో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాలను చేర్చింది. ఈ జిల్లాల్లో ఒకటే మెనూ అమలుచేయనుంది. గతంలో రాష్ట్రం మొత్తం ఒకే మెనూ అమల్లో ఉండేది. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మెనూలో మార్పులు చేసింది. కిచిడీ, సాంబారు బాత్‌పై పిల్లలు పెద్దగా ఆసక్తి చూపలేదు. అదే సమయంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో రక్తహీనత, కంటి చూపు వంటి అనారోగ్య సమస్యలున్నట్టు తేలింది. దీంతో కూటమి ప్రభుత్వం విద్యార్థులు నివసించే ప్రాంతాలకు అనుగుణంగా ఆహార పదార్థాలతో మెనూ రూపొందించి అమలు చేయనుంది.

● ఇదీ పరిస్థితి..

జిల్లాలో 1,895 ప్రభుత్వ ప్రాథమిక, 332 ప్రాథమికోన్నత, 334 ఉన్నత పాఠశాలలు మొత్తం 2,561 ఉన్నాయి. వీటిలో 1,54774 మంది విద్యార్థులు చదువుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం అమలుపై నిర్లక్ష్యంగా వ్యవహరించింది. 'జగనన్న గోరుముద్ద' పేరిట మధ్యాహ్న భోజనం పథకం మెనూ మార్చినట్టు చెప్పినా.. విద్యార్థులకు ఉపయోగపడే నిర్ణయాలేవీ తీసుకోలేదు. దీంతో ఆహారం రుచికరంగా లేకపోవడంతో చాలామంది విద్యార్థులు తినకుండానే అన్నాన్ని చెత్తడబ్బాల్లో పడేసేవారు. తద్వారా ఎక్కువ మంది విద్యార్థుల్లో పౌష్టికాహార లోపం వెలుగు చూసింది. కంటిచూపు తగ్గడం, రక్తహీనత వంటివి వెలుగులోకి వచ్చాయి. అందుకే మధ్యాహ్న భోజన పథకంలో సమూల మార్పులు (మిగతా 6వ పేజీలో..)

కొత్త మెనూ ఇలా..

- సోమవారం అన్నం, ఆకుకూర, పప్పు, ఉడకబెట్టిన గుడ్డు, చిక్కీ
- మంగళవారం అన్నం, గుడ్డు కూర, రసం, రాగిజావ
- బుధవారం వెజ్ పలావ్, ఆలూ కుర్మా, ఉడకబెట్టిన గుడ్డు, చిక్కీ
- గురువారం అన్నం, సాంబారు, గుడ్డు కూర, రాగిజావ
- శుక్రవారం పులిహోర, గొంగూర, కూరగాయల చట్నీ, ఉడకబెట్టిన గుడ్డు, చిక్కీ
- శనివారం అన్నం, కూరగాయల కర్రీ, రసం, రాగిజావ, తియ్యని పొంగల్ పెడతారు.

గురుకులంలో ప్రవేశాలకు ఆహ్వానం

శ్రీకాకుళం రూరల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం మండలం పెద్దపాడులోని అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎస్.రంగమణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఆసక్తిగల విద్యార్థులు మార్చి 6వ తేదీలోగా హెచ్‌టీటీపీఎస్://ఏపీబీఆర్ఏజీసీఈటీ. ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలి. ఏప్రిల్ 6న ప్రవేశ పరీక్ష నిర్వహించి.. మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తాం. ఎస్సీకి-75శాతం, బీసీ-సీ కన్వర్టెడ్ క్రిస్టియన్స్‌కి -12శాతం, ఎస్టీకి -6శాతం, బీసీలకు-5శాతం, ఇతరులకు- 2శాతం సీట్లు కేటాయిస్తాం. మరిన్ని వివరాలకు 97045 50007 నెంబర్‌ను సంప్రదించాల'ని ప్రిన్సిపాల్ ఎస్.రంగమణి తెలిపారు.



సగం నిర్మాణంలో ఆగిపోయిన కాశీబుగ్గ ఫ్లైఓవర్ బ్రిడ్జి

కాశీబుగ్గ ఫ్లైఓవర్‌కు రూ.46.64కోట్లు

● రైల్వేశాఖ ఆధ్వర్యంలో నిర్మించేందుకు చర్యలు

6లో

శ్రీముఖలింగేశ్వరుడికి చక్రతీర్థ స్నానం

- వంశధారకు భారీగా తరలి వచ్చిన భక్తులు



చక్రతీర్థ స్నానం ఉత్సవంలో భక్తుల సందడి

జలుమూరు, ఎల్.ఎన్.పేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగేశ్వరస్వామి చక్రతీర్థ స్నానానికి భక్తులు పోటెత్తారు. ఆలయంతో పాటు వంశధార నది శివనామ స్మరణతో హోరెత్తింది. మహాశివరాత్రి ఉత్సవాలు ముగింపు రోజు శుక్రవారం అర్చకులు పార్వతీ పరమేశ్వరులకు వంశధారనదిలో చక్రతీర్థ స్నానాలు ఆచరించారు. వేకువజాము నుంచే భక్తులు నదిలో స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం 11 గంటలకే భక్తులకు స్వామి దర్శనం నిలుపుదలచేసి పోలీసులు శ్రీముఖలింగంలో ఉన్న భక్తులను వంశధార నదికి పంపించారు. మధ్యాహ్నం 12 గంటలకు పాడ్యమి ఘడియలు తగలగానే ఉత్సవమూర్తులకు నూతనవస్త్రాలు ధరించి పూలమాలలుతో అలంకరించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ అర్చకులు బయటకు తెచ్చి నంది వాహనంపై ఆసీనులను చేశారు. దేవాదాయశాఖ అసిస్టెంటు కమిషనర్ ప్రసాద్ పట్నాయక్, టెక్కలి డీఎస్పీ మూర్తి స్వామివారికి కొబ్బరికాయ కొట్టి 12-30 గంటలకు గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. ఆలయం నుంచి బయలుదేరి వంశధారనదిలోని మిరియాపల్లి రేవుకు చేర్చారు. అక్కడ సాంప్రదాయబద్ధంగా మిరియాపల్లి గ్రామస్థులు ఆహ్వానం పలికి పూజలు చేసి పార్వతీ పరమేశ్వరులకు వంశధారనదిలో చక్రతీర్థ స్నానాలు చేయించారు. ఆ సమయంలో లక్షలాది మంది భక్తులు నదిలో స్నానాలు చేశారు. అనంతరం పార్వతీ పరమేశ్వరులను తిరిగి నందివాహనంపై యథాతథ స్థానానికి చేర్చారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి పర్యవేక్షణలో టెక్కలి డీఎస్పీ మూర్తి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.ప్రభాకరరావు, తహసీల్దారు జన్ని రామారావు తదితరులు పాల్గొన్నారు. కాగా వంశధారనదిలో తగిన ప్రవాహం లేకపోవడంతో భక్తులు స్నానాలు చేయడానికి అవస్థలు పడ్డారు. ఇసుకతిన్నెలపై కూర్చుని తలపై నీళ్లు చల్లుకున్నారు.



పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి బయటకు తెస్తున్న అర్చకులు



వంశధారలో గంగిరెద్దుకు పూజలు చేస్తూ..



చక్రతీర్థ స్నానాలకు నందివాహనంపై పార్వతీ పరమేశ్వరులను గ్రామోత్సవంగా తీసుకెళ్తూ..



ప్రత్యేక దర్శనం క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు



శ్రీముఖలింగేశ్వరస్వామికి లింగాభరణ కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీముఖలింగేశ్వరస్వామికి లింగాభరణం..

శ్రీముఖలింగేశ్వరస్వామికి శుక్రవారం రాత్రి లింగాభరణం కార్యక్రమం అర్చకులు నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం బియ్యంతో స్వామివారికి అభిషేకించి బంగారు ఆభరణాలు అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.ప్రభాకరరావు, ఆలయ ధర్మకర్త పర్లాకిమిడి రాజావారి అర్చకులు శరత్‌చంద్రపాడీ, అర్చకులు వెంకటాచలం, ప్రభాకరరావు, సింహాచలం, శ్రీకృష్ణ, నారాయణమూర్తి, శ్రీకృష్ణ శివ, పలువురు భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా శోభాయాత్ర

ఆమదాలవలస, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): లొద్దలపేట గ్రామం శుక్రవారం శ్రీరాముని నామస్మరణతో పులకించింది. గ్రామంలో వెలసిన శ్రీసీతారామ ఆలయ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. స్థానిక మహిళలు అధిక సంఖ్యలో పూర్ణ కలశాలతో బేరదేవతామూర్తుల గ్రామ విహార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది.



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



ఉదయం పొగ..

ఉదయం పూట దట్టంగా కురుస్తున్న పొగమంచు



మధ్యాహ్నం సెగ

మధ్యాహ్నం ఎండ తీవ్రతకు వెలవెలబోతున్న టెక్కలి ప్రధాన కూడలి

టెక్కలి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా మండలంలో ఉదయం 7 గంటలు దాటినా పొగమంచు వీడడం లేదు. మధ్యాహ్నం 12గంటలు అయ్యేసరికి వేసవిని తలపించేలా ఎండలు మండిపోతున్నాయి. ఈ విభిన్న వాతావరణ పరిస్థితులతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ఉదయం పొగమంచు, మధ్యాహ్నం ఎండవేడిమితో ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కొత్త మెనూ

(ఐదో పేజీ తరువాయి)

చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంగా పేరు మార్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు, పిల్లల్లో పౌష్టికాహారాన్ని లోపాన్ని సరిదిద్దేందుకు కొత్త మెనూ రూపొందించింది.

మెనూ మారింది..

జిల్లాలో మధ్యాహ్న భోజన పథకం మెనూను ప్రభుత్వం మార్చింది. విద్యార్థుల ఆరోగ్యం, బలవర్థక ఆహారం అందించాలన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకుంది. విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మధ్యాహ్న భోజన పథకాన్ని నాలుగు జోన్లుగా విడదీశారు. ఒక్కోజోన్‌లో స్థానికతకు అనుకూలంగా ఉన్న మెనూను కేటాయించారు. జిల్లాలోని 360 పాఠశాలల ఆవరణలో పండించిన కూరగాయలను వినియోగిస్తున్నాం. శ్రీకాకుళం, గార, ఆమదాలవలసలోని 309 పాఠశాలల్లో అక్షయపాత్ర ద్వారా 20,508 మంది విద్యార్థులు భోజనాలు చేస్తున్నారు. వంట ఏజెన్సీ నిర్వాహకులకు విజయవాడలో ప్రత్యేక శిక్షణ ఇచ్చాం.

-తిరుమల చైతన్య, డీఈవో, శ్రీకాకుళం

కాశీబుగ్గ ఫ్లైఓవర్‌కు రూ.46.64 కోట్లు

- రైల్వేశాఖ ఆధ్వర్యంలో నిర్మించేందుకు చర్యలు

పలాస, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వేశాఖ ఎట్టకేలకు ముందుకు వచ్చింది. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కృషి మేరకు రూ.46.64 కోట్లు ఇస్తున్నట్లు రైల్వేశాఖ ఇంజనీరింగ్ అధికారుల నుంచి జీవో విడుదలైంది. దీనికి సంబంధించిన వివరాలు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు సోషల్‌మీడియా ద్వారా పంచుకున్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కాశీబుగ్గ, బెండి రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిలకు అప్పటి ఎమ్మెల్యే హనుమంతు అప్పయ్యదొర శంకుస్థాపన చేశారు. అయితే ఆయన హయాంలో దీన్ని నిర్మించలేకపోయారు. తర్వాత వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం బెండి బ్రిడ్జిని పూర్తి చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిచే వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. కాశీబుగ్గ ఫ్లైఓవర్ బ్రిడ్జి మాత్రం సాంకేతిక కారణాలు, నిర్వాసితుల సమస్యల కారణంగా పూర్తి చేయలేక పోయారు. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీన్ని తామే పూర్తి చేసి ఎన్నికల్లోకి వెళ్తామని హామీలు ఇచ్చినా సగం పూర్తి చేసి చేతులు ఎత్తేసింది. భవన నిర్మాణ సామగ్రి ధరలు పెరగడం, నిర్వాసితుల సమస్యలు తేలకపోవడంతో దాని వ్యయం రెండింతలయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే శిరీష నేతృత్వంలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు దృష్టికి ఈ సమస్యలు తీసుకుని వెళ్లారు. ఆయన నేరుగా రైల్వేమంత్రి అశ్వనివైష్ణవ్‌కు వినతిపత్రం అందించడంతో పాటు రైల్వేబ్రిడ్జి ప్రాధాన్యం తెలిపారు. రైల్వేమంత్రి సానుకూలంగా స్పందించి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రైల్వేశాఖ ఆధ్వర్యంలోనే పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు చేయడం, ఇందుకు రూ.46.64 కోట్లు ప్రకటించడం వెంటవెంటనే జరిగిపోయాయి. పనులు త్వరలోనే ప్రారంభం అయ్యే అవకాశం ఉంది. ఎమ్మెల్యే గౌతు శిరీష స్పందిస్తూ నిధులు విడుదల చేసినందుకు పలాస నియోజకవర్గ ప్రజల తరుపున రైల్వే మంత్రి, పౌరవిమానయానశాఖ మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.



రైల్వే మంత్రితో బ్రిడ్జి సమస్యలు విన్నవిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష (ఫైల్)..

తీరనున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి సమస్యలు..



ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.46 కోట్ల నిధులు తీసుకురావడం గొప్ప విషయం. ఎవరికీ సాధ్యం కాని ఈ పని పలాస ఎమ్మెల్యే శిరీష సాధించడం అభినందనీయం. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, రైల్వే మంత్రి అశ్వనివైష్ణవ్‌కు ప్రజలు రుణపడి ఉంటారు.

-వజ్జ బాబూరావు, ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్

ట్రాఫిక్ కష్టాలు తీరినట్లే..



బ్రిడ్జి లేకపోవడంతో ట్రాఫిక్ కష్టాలు తీవ్రంగా ఉన్నాయి. గేటు వేశారంటే కనీసం 45 నిమషాలు చిక్కుకోవాల్సిందే. గత ప్రభుత్వాలు నిధులు ఇవ్వని కారణంగా బ్రిడ్జి నిర్మాణం ఆగిపోయింది. కూటమి ప్రభుత్వంలో మా ఎమ్మెల్యే, కేంద్రమంత్రి కృషి ఫలితంగా బ్రిడ్జికి మోక్షం లభించింది. నిర్మాణం వేగవంతం చేసి ప్రజల కష్టాలు తీరుతాయన్న నమ్మకం ఉంది.

-లొడగల కామేశ్వరరావుయాదవ్, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి



56 ఏళ్ల తరువాత.. ఆత్మీయ కలయిక

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అందరూ సుమారు 70 ఏళ్లు దాటిన వారే. కానీ ఒక్కసారిగా చిన్న పిల్లలుగా మారిపోయారు. విద్యార్థి దశ నాటి స్మృతులను తలచుకుంటూ ఆనందంగా గడిపారు. ఇదీ సుమారు 55 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థుల ఆనందోత్సాహం. నగరంలోని ఎన్.టి.ఆర్. మున్సిపల్ స్కూల్‌లో 1968-69 సంవత్సరం బ్యాచ్ 12వ తరగతి విద్యార్థుల ఆత్మీయ కలయికను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖ్యాతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి రూ.15 వేల విలువ చేసే రైస్ కుక్కర్, వాటర్ డిస్పెన్సర్ అందించారు. మరికొంతమంది వ్యక్తిగతంగా సాయం అందించారు. సమావేశానికి ముందుగా ఇటీవల కాలంలో మృతి చెందిన తమ మిత్రులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ మండ ప్రభాకర్‌రావు, జె.ఎస్.ఎస్. ప్రకాశ్‌రావు, మండాన చంద్రశేఖరరావు, ఎం.సీతారామమూర్తి, డా.సంపత్ కుమార్, డా.శేషగిరి బాబు, రామకోటేశ్వరరావు, ఎ.వెంకటేశ్వరరావు, బి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాస్‌లోనే కొనసాగించండి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని ఆప్కాస్‌లోనే కొనసాగించాలని కోరుతూ సిటు ఆధ్వర్యంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిటు ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు, యూనియన్ నగర కన్వీనర్ ప్రకాశరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, నగర అధ్యక్షుడు ఎ.గణేష్ మాట్లాడుతూ ఆప్కాస్‌ను రద్దు చేసి, ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం దారుణమన్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 8 సంవత్సరాల సర్వీసు పూర్తయిన ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని... ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. మున్సిపల్, పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులకు పనిముట్లు అందజేయాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ పరిపాలనాధికారి సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మేస్త్రీ మురుగన్, కె.వెంకట్, మోహనరావు, ఎ.గురుస్వామి, డి.యుగంధర్, శంకర్ గణేష్, ఎ.జ్యోతిప్రసాద్, పి.మణికంఠ, పి.త్రినాథ్, బి.వెంకటరమణ, పి.శాంతి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

4న పూసర్లపాడులో సిరిమానోత్సవం


అసిరితల్లి

గార, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పూసర్లపాడు గ్రామ దేవత అసిరితల్లి సిరిమాను ఉత్సవాన్ని మార్చి 4వ నిర్వహించడానికి ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. ఉత్సవంలో భాగంగా సిరిమానును ఊరేగించనున్నారు. గ్రామ దేవత ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఆదివారం దేవర తీసుకురావడం, సోమవారం ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

మున్సిపల్ సాధారణ సమావేశం వాయిదా

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం సాధారణ సమావేశం జరిగింది. అజెండాలో పొందుపరచిన వివిధ అంశాలపై చర్చ జరగాల్సి ఉండగా... ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా సమావేశాన్ని చైర్‌పర్సన్ వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, వైస్ చైర్‌పర్సన్లు ఉలాల భారతిదివ్య, లాభాల స్వర్ణమణి, అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగులను నిరాశపర్చిన బడ్జెట్

గుజరాతీపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఉద్యోగులకు సంబంధించిన మొండి బకాయిలకు గానీ, వేతన సవరణకు సంబంధించి ఎటువంటి నిధులు కేటాయించకపోవడం ఉద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేసిందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.రవి, కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ముందుకు ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

విశిష్ట గుర్తింపు తప్పనిసరి

జి.సిగడాం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): సొంత భూములు కలిగి ఉన్న ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్యతో కూడిన కార్డు తప్పనిసరి అని ఏవో ఎర్రా శారద అన్నారు. శుక్రవారం పాలఖండ్యాం రైతు సేవా కేంద్రంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ ముంతా హరీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరికి తాటాకు తెగులు

కవిటి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రబీ సీజనులో వరిపంట వేసిన బీలప్రాంతంలో పంటకు తాటాకు తెగులు సోకిందని వ్యవసాయాధికారి బి.దుర్గాప్రసాద్ తెలిపారు. మాణిక్యపురం ప్రాంతంలో శుక్రవారం పంట పొలాలను పరిశీలించారు. పొడ తెగులు నివారణకు ప్రొపెనోపాస్, హెక్సాకోనజోల్ రెండు మిల్లీలీటర్లు చొప్పున నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ఆయనతో పాటు వ్యవసాయ సహాయకులు అన్వేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

60 మద్యం సీసాల స్వాధీనం

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి అక్రమంగా అయిదు పెట్టెల్లో తరలిస్తున్న 60 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు మొబైల్ ఎక్సైజ్ సీఐ జీవీ రమణ తెలిపారు. వీటి విలువ రూ.10 వేలు ఉంటుందని వివరించారు. శుక్రవారం ఈదుపురం వద్ద ఒడిశా నుంచి వచ్చిన కారును తనిఖీ చేయగా మద్యం సీసాలతో ఉన్న పెట్టెలు దొరికాయన్నారు. సీసాలతో పాటు కారును సీజ్ చేశామని.వీటిని తరలిస్తున్న సోంపేట మండలం కొర్లాం గ్రామానికి చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ దాడుల్లో విరలేశ్వరరావు, శ్రీనువాసరావు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

కవిటి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెజ్జిపుట్టుగ గ్రామంలో వెలసిన అసిరిపోలమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలంతా కలసి గ్రామదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

కల్వర్టుకు మరమ్మతులు


కల్వర్టు పనులు చేపడుతున్న దృశ్యం

జి.సిగడాం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాజాం-చిలకపాలెం ప్రధాన రహదారి లో ధవళపేట కూడలి వద్ద శిథిలమైన కల్వర్టుకు ఆర్ అండ్ బీ అధికారులు శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. ఇది శిథిలం కావటంతో కొంతకాలంగా ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20 లక్షలతో మరమ్మతులు చేపట్టినట్టు జేఈ పీటీ రాజు తెలిపారు.

జల జీవన్ మిషన్ పనులు వేగవంతం


పనులు పరిశీలిస్తున్న అధికారులు

పొందూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తాగునీటికి కటకటలాడే రాపాక గ్రామంలో ఇంటింటికి కుళాయి ఏర్పాటు పనులు వేగవంతమయ్యాయి. రాపాకలో జలజీవన్‌మిషన్ పనులు జరగకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కర్, మండల తెలుగు యువత నాయకులు ఖండాపు శ్రీనివాసరావులు ఎమ్మెల్యే రవికుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో పనులు వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను రవికుమార్ ఆదేశించారు. ఈమేరకు చురుగ్గా పనులు చేపడుతున్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

జి.సిగడాం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని వైద్యాధికారి బి.యశ్వంత్ అన్నారు. శుక్రవారం వాండ్రంగి ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించి.. రోగులకు మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాకేటి నాగరాజు, మాజీ సర్పంచ్‌లు బూరాడ వెంకటరమణ, సనపల త్రినాథరావు, ఎఎన్‌ఎం అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

దర్జీలను ప్రభుత్వం ఆదుకోవాలి

సోంపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి):దర్జీలను ఆదుకోవాలని బారువకు చెందిన నూకాలమ్మ దర్జీల సంఘ ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. టైలర్స్ దినోత్సవం సందర్భంగా బారువలో సంఘం ప్రతినిధులు శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడీమేడ్ దుస్తులపై ప్రజలు ఆసక్తి చూపిస్తున్న తరుణంలో తమకు పూట గడవడం కూడా కష్టమైందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కొండదాసుల శ్రీనివాసరావు, కాళిదాసు, బాలకృష్ణ, ఈశ్వరరావు, రమణ, సీత, సుధ పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): టైలర్స్ డేని శుక్రవారం శ్రీకాకుళం టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చౌక్ బజార్ జంక్షన్‌లో ఘనంగా నిర్వహించారు. చౌక్ బజార్ వద్ద ఏ.పి.టైలర్స్ కోఆపరేటివ్ సొసైటీల పరిరక్షణ కమిటీ గౌరవాధ్యక్షులు పాపారావు పతాకాన్ని ఆవిష్కరించారు. కుట్టు మిషన్ సృష్టికర్త విలియం హార్వే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనారోగ్యంతో బాధ పడుతున్న టైలర్ కృష్ణకు శ్రీకాకుళం టైలర్స్ అసోసియేషన్ సభ్యులు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు శ్రీనివాస పండా, అధ్యక్షులు వేణు, రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో 92.45 శాతం ఓటింగ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి పోలింగ్ శాతం స్వల్పంగా పెరిగింది. ప్రిసైడింగ్ అధికారులు ఇచ్చిన వివరాల ప్రకారం 92.45 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆరు జిల్లాల పరిధిలో మొత్తం 22,493 మంది ఓటర్లు ఉండగా 20,794 మంది (92.45శాతం) ఓటు వేశారు. పురుషులు 13,508 మందికి 12,576మంది, మహిళలు 8,985కి 8,216 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు.

విజ్ఞాన శాస్త్రంతో సమాజాభివృద్ధి: వీసీ


ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న వీసీ కేఆర్ రజని తదితరులు


గుజరాతీపేట: మాట్లాడుతున్న నాగేశ్వరరావు


కాశీబుగ్గ: సాయి శిరీష హైస్కూల్‌లో..


నరసన్నపేట: రవీంద్రభారతిలో..

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సైన్స్ అండ్ టెక్నాలజీలో నూతన ఆవిష్కరణలతో సమాజాభివృద్ధి సాధ్యమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో శుక్రవారం నిర్వహించిన సైన్స్ దినోత్సవంలో ఆమె మాట్లాడారు. పరిశోధనలు, నూతన ఆవిష్కరణల్లో మహిళలు ముందంజలో ఉండాలని పిలుపునిచ్చారు. వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య మాట్లాడుతూ పరిశోధనా రంగంలో జరుగుతున్న అభివృద్ధి సమాజానికి ఎంతో ప్రయోజనకారిగా నిలుస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్, డీన్‌లు డాక్టర్ ఎన్.లోకేశ్వరి, డాక్టర్ కె.స్వప్నవాహిని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు.


ఎచ్చెర్ల: శ్రీ ఆదిత్య విద్యాలయంలో..


కొత్తూరు: కడుం హైస్కూల్‌లో తల్లిదండ్రులకు పాదాభివందనం

శాస్త్రీయ దృక్పథం అవసరం

గుజరాతీపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని మాజీ వైస్ చాన్సలర్ జి.నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కొత్త ఆలోచనలతోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.సూర్యచంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యాన్ని వెలికితీయాలి

కాశీబుగ్గ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పిల్లల్లో సాంకేతిక నైపుణ్యాన్ని వెలికి తీయాలని సాయి శిరీష హైస్కూల్ కరస్పాండెంట్ కవిటి భారతి అన్నారు. శుక్రవారం చినబాడాంలో గల సాయి శిరీష హైస్కూల్లో ఘనంగా సైన్స్‌డే నిర్వహించారు. ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. 70కిపైగా ఏర్పాటు చేసిన ప్రాజెక్టులను విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు వీక్షించారు.

క్విజ్ విజేత ఇన్నేసుపేట

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఇన్నేసుపేట మండల పరిషత్ పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో స్థానిక ఎంపీపీఎస్ పాఠశాల విజేతగా నిలిచింది. శుక్రవారం నిర్వహించిన క్విజ్ పోటీల్లో 72 టీంలు పాల్గొన్నాయి. ఇందులో ప్రథమ, ద్వితీయ బహుమతులు ఇన్నేసుపేట ఎంపీపీ పాఠశాల జట్లకు, తృతీయ బహుమతి సోంపేట టీడీఆర్ కోచింగ్ సెంటర్ విద్యార్థులకు లభించాయి. విజేతలకు ఎంఈఓ ఎస్ విశ్వనాథం బహుమతులు అందజేశారు.

అచ్చెన్నకు రామన్న అభినందన


రాష్ట్ర మంత్రి అచ్చెన్నతో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అభినందించారు. రాష్ట్ర వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టడం.. అభివృద్ధి విషయంలో శ్రీకాకుళం జిల్లాకు నిధుల కేటాయింపులో ప్రాధాన్యం కల్పించిన అంశంలో బాబాయి అచ్చెన్నను కేంద్రమంత్రి, అబ్బాయి రామ్మోహన్‌నాయుడు స్వయంగా విజయవాడలో కలసి అభినందించారు. ఈ మేరకు ఓ ప్రకటనలో విషయాన్ని తెలియజేశారు.

'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో శంకరరావు


శంకరరావు దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

కవిటి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): బొరివంక గ్రామానికి చెందిన బి.శంకరరావు మాస్టారుకు అరుదైన రికార్డు దక్కిందని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. శుక్రవారం స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో శంకరరావుకు పదవీ విరమణ సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తివిద్యా ఉపాధ్యాయునిగా శంకరరావు 40 ఏళ్ల పాటు విధులు నిర్వహించి...అదే పాఠశాలలో పదవీ విరమణ చేయడం అరుదైన రికార్డు అన్నారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డులలో స్థానం సంపాదించడం విశేషమన్నారు. ఈ సందర్భంగా బి.శంకరరావు దంపతులకు దుశ్శాలువ, జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కె.పద్మ, ప్రకాష్, సర్పంచ్ బి.శ్రీరాంప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు డి.సతీష్, ప్రధానోపాధ్యాయుడు ఎస్.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్రజాదర్బార్

ఆమదాలవలస, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆవరణలో శనివారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు టీడీపీ కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. ఎమ్మెల్యే కూన రవికుమార్ నిర్వహించే ఈ ప్రజా దర్బార్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించనున్నట్టు చెప్పారు.

నేటి నుంచి డోలోత్సవాలు

కవిటి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): బెజ్జిపుట్టుగ గ్రామంలో వెలసిన శ్రీచక్రపెరుమాళ్ల స్వామి వారి డోలోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ ధర్మకర్తలు, గ్రామస్థులు తెలిపారు. 15రోజుల పాటు స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు పల్లకి సేవ, గరుడోత్సవాన్ని నిర్వహించనున్నారు. చారిత్రక ప్రాముఖ్యం గల ఈ ఉత్సవాలలో భాగంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

నిధులు మంజూరు

ఆమదాలవలస, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వివిధ గ్రామాల్లో చేపట్టనున్న 94 అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనట్టు స్థానిక టీడీపీ కార్యాలయ వర్గాలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపాయి. ఈ పనులకు రూ.8.46 కోట్లు మంజూరైనట్టు వెల్లడించాయి.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

ఆమదాలవలస, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సత్యసాయి సేవా సంస్థల విద్యాజ్యోతి రాష్ట్ర ఇన్‌చార్జి ఎస్.వి.ఎస్.గురు ప్రసాద్ అన్నారు. వేణమ్మపేట, అక్కులపేట సత్యసాయి సేవామితి ఆధ్వర్యంలో తాళ్లవలసలోని కస్తూరిబా పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

కంబాలవాని చెరువులో ఆక్రమణల గుర్తింపు


సరిహద్దు రాళ్లను వేయిస్తున్న అధికారులు

జి.సిగడాం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వాండ్రంగి కంబాలవాని చెరువులో శుక్రవారం రెవెన్యూ అధికారులు జిరాయితీ, ప్రభుత్వ భూమికి గల సరిహద్దులతో పాటు ఆక్రమణల గుర్తింపును చేపట్టారు. గ్రామస్తులు ఇటీవల తహసీల్దార్ కార్యాలయంలో ఇచ్చిన పిర్యాదు మేరకు సర్వే నెంబరు 213/2లో 12 ఎకరాల 49 సెంట్ల విస్తీర్ణంలో గల కంబాలవాని చెరువు, సర్వే నెంబరు 152/2లో ఎకరా 49 సెంట్లలో గోర్జికి సంబంధించిన కొంత విస్తీర్ణం ఆక్రమణకు గురైందని గ్రామస్తులు తహసీల్దార్ ఎం.శ్రీకాంత్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు ఆక్రమణలను గుర్తించి... గ్రామస్తుల సమక్షంలో హద్దురాళ్లు వేశారు. పోలీసు భద్రత నడుమ మిగిలిన ఆక్రమణలను గుర్తిస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ సర్వేలో ఆర్ఐ ఆబోతుల రాధ, సర్వేయర్లు శాంతారావు, సాయి, రాజు, ఐకేపీ మొయ్యి ఈశ్వరరావు, వీఆర్వో శివన్నారాయణ, సర్పంచ్ సాకేటి నాగరాజు, మాజీ సర్పంచ్‌లు బూరాడ వెంకటరమణ, సనపల త్రినాథరావు, గ్రామ పెద్దలు బొట్ల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంవీఐ కార్యాలయం తరలిస్తే ఉద్యమం


మాట్లాడుతున్న కొండా శంకర్‌రెడ్డి

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): 'గడిచిన 25 ఏళ్లగా ఇచ్ఛాపురం ఎంవీఐ కార్యాలయం ద్వారా ఆటోలకు సంబంధించిన సేవలు అందుకుంటున్నాం. ఇప్పుడు ఈ సేవలను ఎచ్చెర్లకు తరలిస్తామని అధికారులు చెబుతున్నారు. కొత్త షరతులతో ఆటో యజమానులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఈ యోచనను ఉపసంహరించుకోవాలి. లేదంటే ఉద్యం చేస్తామ'ని నియోజకవర్గ ఆటో యూనియన్స్ సభ్యులు అన్నారు. శుక్రవారం పట్టణ పరిధి సంతపేట వద్ద గల యూనియన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త నిబంధనల కారణంగా ఆటో రికార్డులు, లైసెన్స్‌లు, ఫిట్‌నెస్‌ల కోసం ఎచ్చెర్ల వెళ్లడం కష్టంతో కూడిన పని అన్నారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 16 సంఘాల ప్రతినిధులు, కొండా శంకర్‌రెడ్డి, ఉలాసి ఎర్రయ్య, మోహన్, సూర్యప్రకాష్, హరి, ఈశ్వర్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై దృష్టి సారించాలి: డీఎంహెచ్‌వో


కిట్లను పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ

అరసవల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బాల మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన ఆదివారంపేట పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఫైలేరియా రోగులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి పి.వి.సత్యనారాయణ, వైద్యాధికారి హరినాయుడు, పారా మెడికల్ ఆఫీసర్ వాన సురేష్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోండి

శ్రీకాకుళం కలెక్టరేట్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. తాగునీటి సరఫరాకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని తెలిపారు. కలెక్టర్లతో శుక్రవారం సచివాలయం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛనును ఉదయం 7 గంటల నుంచి ప్రారంభించి సాయంత్రం 5 గంటలకు పూర్తి చేయాలని తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, సీపీవో ప్రసన్నలక్ష్మి, పీడీ శాంతిశ్రీ, డీపీవో భారతి సౌజన్య, వ్యవసాయ శాఖ అధికారి కోరాడ త్రినాథ స్వామి, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, డీఎంహెచ్ఓ బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.

కిడ్నీ ఇప్పిస్తామంటూ..

మహారాణిపేట (విశాఖపట్నం), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ ఇప్పిస్తామంటూ నకిలీ వైద్యులు రూ.లక్ష తీసుకుని ఉడాయించారు. ఈ విషయమై బాధితులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. నరసన్నపేట మండలం ఉప్పరపేట గ్రామ వాసి దూసి రాంజీకి, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చిన్న కుమారుడు మోక్షిత్ రామ్ (5) కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతున్నాడు. విశాఖలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. కిడ్నీ మార్పిడి చేయాల్సి ఉంటుందని వైద్యులు చెప్పారు. చికిత్స కోసం అందినకాడికి రాంజీ అప్పులు చేశారు. బాలుడి ఆరోగ్యం క్షీణించడంతో కిడ్నీ మార్పిడి చికిత్సకు అవసరమైన సహాయం చేయాలని దాతలను కోరుతూ ఒక దినపత్రికలో ప్రకటన ఇచ్చారు. ఆ మరుసటిరోజు రాంజీకి ఒక ఫోన్ వచ్చింది. తాను కేజీహెచ్‌లో వైద్యుడిగా పనిచేస్తున్నానని, తన పేరు నరసింహం అంటూ ఆ వ్యక్తి చెప్పాడు. కిడ్నీ ఏర్పాటుచేస్తానన్నాడు. బాలుడి తండ్రి రాంజీ వెంటనే కేజీహెచ్‌కు వెళ్లి ఫోన్ చేయగా...తన అసిస్టెంట్‌ను పంపిస్తున్నానని, అతడిని కలవాలని సూచించాడు. రాంజీని ఓ వ్యక్తి వచ్చి తన పేరు డాక్టర్ ప్రవీణ్‌గా పరిచయం చేసుకున్నాడు. కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయ ఆవరణ వద్దకు తీసుకువెళ్లి, అక్కడ నుంచి ఆస్పత్రిలోకి వెళ్లి వచ్చి సాయంత్రానికి లక్ష రూపాయలు సిద్ధం చేసుకోవాల్సిందిగా చెప్పాడు. కేజీహెచ్‌లోనే కిడ్నీ డోనర్ ఉన్నారన్నాడు. బాలుడి తల్లి తన ఒంటి మీద ఉన్న వస్తువులను అమ్మింది. మరుసటిరోజుకు రూ.లక్ష తీసుకువెళ్లారు. నరసింహానికి ఫోన్ చేయగా ఆ డబ్బును పిల్లల వార్డు వద్ద ఉన్న తన కారు డ్రైవర్‌కు ఇవ్వాలని చెప్పాడు. రాంజీ వాళ్లు చెప్పిన విధంగానే డబ్బును ఇచ్చేశాడు. డబ్బులు తీసుకున్నప్పటి నుంచి ముగ్గురి జాడ లేదు. కేజీహెచ్‌లో సంబంధిత వైద్యులను సంప్రతించగా అటువంటివారు ఎవరూ లేరని తెలిపారు. దీంతో తమ నుంచి లక్ష రూపాయలు కాజేసింది నకిలీ డాక్టర్లుగా గుర్తించారు. వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సబ్సిడీ మరిచారు... నోటీసులు ఇచ్చారు!

కవిటి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకానికి సంబంధించి మత్స్యకారులకు సబ్సిడీని అందించాల్సిన అధికారులు ఆ సంగతి మరచిపోయారు. కానీ తీసుకున్న రుణం తిరిగి చెల్లించలేదంటూ మత్స్యకారులకు కోర్టు నోటీసులు పంపించడం గమనార్హం. దీంతో వీరంతా తమకు అందించిన మిషనరీతో కవిటిలోని వెలుగు కార్యాలయం వద్దకు వెళ్లి ఆందోళన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. సిహెచ్.కపాసుకుద్దిలోని మత్స్యకార సంఘానికి చెందిన కె.పురుషోత్తంనకు 2023లో ప్రధానమంత్రి ఫుడ్‌ప్రాసెస్ పథకం కింద రూ.90వేల బ్యాంకు రుణాన్ని అందించారు. ఎండుచేపల తయారీకి మిషనరీని అందించారు. దీనిపై శిక్షణ కూడా ఇచ్చారు. కానీ ఆ తర్వాత ఈ యూనిట్‌లకు అందించాల్సిన సబ్సిడీని మరచిపోయారు. వీటి ద్వారా చేపలు ఎండబెట్టడానికి సమయం పడుతుండటంతో మిషనరీతో పనులు చేసేందుకు మత్స్యకారులు ఆసక్తి చూపలేదు. దాంతో బ్యాంకు నుంచి తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించలేదు. ఈ మేరకు బ్యాంకు మేనేజరు సంబంధిత వ్యక్తుల ఖాతాలను స్తంభింపజేసి.. తీసుకున్న రుణాన్ని చెల్లించాలని కోర్టు నోటీసులు పంపించారు. దీనిపై మత్స్యకారులు వెలుగు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. బలవంతంగా యూనిట్లను కట్టబెట్టి... ఇప్పుడు నోటీసులు రావటంతో తమ బతుకులు నాశనమైపోతున్నాయని వాపోయారు. ఈ విషయమై వెలుగు డీపీఎం రామ్మోహన్ స్పందిస్తూ.. సంబంధిత అధికారులను సంప్రదించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీంతో వారంతా మిషనరీని విడిచిపెట్టి వెనుదిరిగారు.



కనుల పండువగా..

- వివిధ ప్రాంతాల్లో చక్రతీర్థ స్నానాలు
- వేలాదిగా తరలివెళ్లిన భక్తులు

జిల్లాలో వివిధ ప్రాంతాల్లో శుక్రవారం జరిగిన చక్రతీర్థ స్నానాలు కనుల పండువగా సాగాయి. స్వామివారి ఉత్సవమూర్తులకు నదీ స్నానాలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. వేలాదిగా భక్తులు పాల్గొని పునీతులయ్యారు.


చక్రతీర్థ స్నానాల్లో పాల్గొన్న భక్తజన సందోహం


వంశధార నదిలో భక్తుల సందడి


స్వామివారికి చక్రతీర్థ స్నానం చేస్తున్న దృశ్యం

ఉమాకామేశ్వరి స్వామికి..

నరసన్నపేట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): లుకులాం గ్రామంలో త్రిశూల ఉమాకామేశ్వరి స్వామి చక్రతీర్థ స్నానాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కామేశ్వరపేట మీదుగా ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగింపుగా వంశధార నదిలోకి తీసుకువచ్చారు. ఆగమ పండితులు కస్నేపల్లి వెంకట శివరామ జోగయ్య శర్మ ఆధ్వర్యంలో పురోహితులు నగరంపల్లి సుబ్రహ్మణ్యం, సుసరాం సూర్యం ప్రత్యేక పూజలు చేశారు. వేలాది మంది భక్తులు చక్రతీర్థస్నానాల్లో పాల్గొని పునీతులైయ్యారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

మహేంద్రతనయ నదిలో..


ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

పాతపట్నం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నీలకంఠేశ్వరుడు, కేదారీశ్వరుని చక్రతీర్థ స్నానాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా స్థానిక మహేంద్రతనయ నదిలో శాస్త్రోక్తంగా చక్రతీర్థ స్నానాలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎండల మల్లికార్జున స్వామికి..

టెక్కలి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రావివలసలో గల ఎండలమల్లికార్జున స్వామి ఉత్సవాలు అనంతరం భ్రమరాంబిక, మల్లికార్జునస్వామి విగ్రహాలకు శుక్రవారం తిరువీధి నిర్వహించారు. అనంతరం విగ్రహాలకు సీత కోనేరులో చక్రతీర్థ స్నానాలు చేపట్టారు. కార్యక్రమంలో ఈవో గురునాథరావు, అర్చకులు, గ్రామస్థులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.


స్వామివారి తిరువీధిలో పాల్గొన్న భక్తులు

పురుషోత్తపురంలో..

నరుబుజ్జిలి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురం గ్రామంలో శుక్రవారం ఉమాకామేశ్వరస్వామి చక్రతీర్థ స్నానాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగవరపు వాసుదేవశర్మ ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా వెళ్లి వంశధార నదిలో చక్రతీర్థ స్నానాలు చేశారు. కార్యక్రమంలో పరిసర ప్రాంత గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని వంశధార నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు.


వంశధార నదిలో చక్రతీర్థ స్నానాలు చేస్తున్న దృశ్యం


చక్రతీర్థ స్నానాల్లో పాల్గొన్న భక్తులు

ఉమా జఠలేశ్వరునికి..

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నక్కవీధిలో ఉన్న ఉమాజఠలేశ్వరునికి మహాశివరాత్రి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. పార్వతీ పరమే శ్వరులకు తిరువీధి నిర్వహించారు. అర్చకులు అశ్వినీ కుమార్ ఆధ్వర్యంలో స్వామి వారికి చక్రతీర్థ స్నానాలు చేయించారు.

ఉమారుద్ర కోటేశ్వర స్వామివారికి..

హిరమండలం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చిన్న కోరాడ వీధిలోని ఉమారుద్ర కోటేశ్వరస్వామి వారి చక్కతీర్థ స్నానాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా వంశధార నదిలోకి తీసుకువెళ్లి చక్రతీర్థ స్నానాలు చేయించారు.


ఉత్సవమూర్తులతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

జలుమూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగేశ్వరుని చక్రతీర్థం స్నానాల్లో భక్తులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించినా సంబంధిత అధకారులు పట్టించుకోలేదు. వంశధార నదిలో భక్తులకు ఎండ తగలకుండా షామియానాలు, తాగునీటి సౌకర్యం కల్పించాలని కలెక్టర్ ఆదేశించినా ఫలితం లేకపోయింది. మహిళలు స్నానాలు అనంతరం దుస్తులు మార్చుకోవడానికి తాత్కాలిక గుడారాలు లేకపోవడంతో ఇబ్బందిపడ్డారు. తాగునీరు లేక నదిలోనే చలమలు తీసుకుని భక్తులు గొంతు తడుపుకున్నారు. ఎండ నుంచి రక్షణగా తువ్వాళ్లు తలపై వేసుకున్నారు. ఇలా భక్తుల కష్టాలు వర్ణనాతీతం. ఇదిలావుంటే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామ శివారున, వాహనాలు పార్కింగ్ చేసే చోట తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేసినా నీటి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందిపడ్డారు. అధికారుల గెస్టుహౌస్ వెనుక ఉన్న మరుగుదొడ్లకు తాళం వేయడంపై భక్తులు విష్మయం వ్యక్తం చేశారు.


ఎండలో అవస్థ పడుతున్న మహిళలు

ట్రాఫిక్ సమస్య

స్వామివారి చక్రతీర్థ స్నానాలకు టెక్కలి డీఎస్పీ మూర్తి ఆధ్వర్యంలో నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు, జలుమూరు ఎస్‌ఐ అశోక్‌బాబు పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. అయితే శ్రీముఖలింగం-మెట్టపేట గ్రామాల మధ్య ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో వాహనాలు భారీగా నిలచిపోయాయి. ఈ ప్రాంతంలో పోలీసులు ఎవరూ లేకపోవడం గమనార్హం. దీంతో వాహనదారులు, కాలినడకన వచ్చిన భక్తులు ఇబ్బందిపడ్డారు.


ట్రాఫిక్ జామ్‌తో నిలిచిపోయిన వాహనాలు

నాగావళి నదిలో పడి వ్యక్తి మృతి

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని తోటపాలెం జంక్షన్ నీలమ్మ కాలనీకి చెందిన యాదవరెడ్డి రాము(40) నాగావళి నదిలో పడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొత్తూరు మండలం బత్తిలి గ్రామానికి చెందిన యాదవరెడ్డి రాముకి ఇద్దరు భార్యలు, నలుగురు పిల్లలు ఉన్నాడు. తోపుడు బండిపై పండ్లు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే కొన్నాళ్లగా మతిస్థిమితం లేనట్టుగా తిరుగుతున్నాడని, ఈ క్రమంలో గురువారం రాత్రి కోటేశ్వరస్వామి ఆలయ పరిసరాల్లో తిరిగినట్టు స్థానికులు చెబుతున్నారు. శుక్రవారం ఉదయం 9.30 గంటల సమయంలో ఏడురోడ్ల కూడలి సమీపంలోని నాగావళి బ్రిడ్జి మీద నుంచి పడి చనిపోయాడు. స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్‌ఐ ఎం.హరికృష్ణ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అయితే రాము బ్రిడ్జిపై నుంచి జారిపడిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. ఏఎస్‌ఐ రమేష్ కేసు నమోదు చేసి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు.

శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

పలాస, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నేషనల్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ స్కీమ్(నాట్స్) కింద వివిధ ట్రేడుల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు కోరారు. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం స్థానిక మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించారు. డిగ్రీ పూర్తి చేసిన వారు దీనికి అర్హులని, ఇందులో రిజిస్టర్ చేసుకున్న వారికి ఆశ సొసైటీ ఆధ్వర్యంలో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఎన్ఎస్‌డీసీ సర్టిఫికేట్లు ఇస్తారని, వీటితో ఉద్యోగాలు పొందవచ్చునన్నారు.

అగ్నిప్రమాదాల నియంత్రణపై అవగాహన

టెక్కలి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో అగ్ని ప్రమాదాల నియంత్రణపై విశాఖకు చెందిన సన్‌రైజ్ ఫైర్ అండ్ సేఫ్టీ ట్రైనర్ జి.భాస్కర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫైర్ డిస్ట్రిబ్యూటర్ పరికరం వినియోగించే తీరుపై వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ పీవో మారుతీప్రసాద్, లోకనాథం, జగదీశ్వరరావు ఉన్నారు.

ఎన్టీఆర్ కాలనీలో తాగునీటి అవస్థలు

టెక్కలి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్ పంచాయతీ ఎన్టీఆర్ కాలనీలోని పలు వీధులకు తాగునీరు అందడం లేదని శుక్రవారం అక్కడి మహిళలు ఖాళీ బిందెలు, బకెట్లతో ఆందోళన చేపట్టారు. తాగునీటి అవస్థలపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు, పంచాయతీ యంత్రాంగానికి తాము పలుమార్లు మొత్తుకున్నా స్పందన లేదని శ్రీదేవి, సుభద్ర, సుమిత్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్య తక్షణమే పరిష్కరించాలని కోరారు.

ఎక్కువ కేసుల రాజీకి సహకరించండి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీనివాసరావు

టెక్కలి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 8న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీకి న్యాయవాదులు, పోలీసులు సహకరించాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు కోరారు. గురువారం బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయవాదులతో సమావేశమయ్యారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వెల వివేకానంద, న్యాయవాదులు పాల్గొన్నారు.

సర్వే పూర్తి చేయాలి

నరసన్నపేట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలను గుర్తించి యాప్‌లో నమోదు చేయాలని జడ్పీ సీఈవో ఎల్‌వీఎన్ శ్రీధర్ సూచించారు. శుక్రవారం స్థానిక మేజర్ పంచాయతీ సచివాలయంలో సిబ్బందితో సమీక్షించారు. ఉర్లాం, మడపాం, నరసన్నపేట పంచాయతీల్లో సర్వే పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూధనరావు, విద్యుత్‌శాఖ ఏఈ కోటేశ్వరరావు, ఈవో ద్రాక్షాయిణి పాల్గొన్నారు.

పర్యావరణంపై ప్రజాభిప్రాయ సేకరణ

టెక్కలి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): టెక్కలి సమీపంలో సర్వే నెం.53లో 4.37 హెక్టార్లకు సంబంధించి నార్పే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ యాజమాన్యం పర్యావరణ అనుమతులు కోసం దరఖాస్తు చేసుకోవడంతో శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రతినిధి కరుణశ్రీ, తహసీల్దార్ రవికుమార్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు. అంజనాపురం గ్రామస్థులు ముడిదాన ఆనందకుమార్ తదితరులు మౌలిక సదుపాయాలు ఈ ప్రాంతంలో కల్పించాలని కోరారు. వీరితో పాటు సంస్థ ప్రతినిధి రమేష్ ఉన్నారు.

దర్జీలను ప్రభుత్వమే ఆదుకోవాలి

హరిపురం, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి): దర్జీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి ఆదుకోవాలని ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు తారకేశ్వరరావు, బి.హరికృష్ణారెడ్డి కోరారు. టైలర్స్ డే వేడుకలు మందస, హరిపురంల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు వీవీ రమణమూర్తి, నటరాజు, శంకరావు, సంతోష్, లక్ష్మణరావు, సాంబమూర్తి, మీనాక్షి, సూర్యనారయణ, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ఐరన్, పోలిక్ మాత్రలు ఇవ్వండి

పోలాకి, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు ఐరన్, పోలిక్ మాత్రలు ఇవ్వాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ అధికారి వి.రామనాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం పోలాకి పీహెచ్‌సీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడి పిల్లల హిమోగ్లోబిన్ స్థాయిని మందింపు చేస్తూ వారికి తగిన వైద్యం అందించాలన్నారు. అనంతరం పీహెచ్‌సీతో పాటు ఆశ కార్యకర్తల రికార్డులను పరిశీలించారు. సమీప అంగన్‌వాడీ, హెల్త్‌వెల్ కేంద్రాలను సందర్శించారు. వైద్యాధికారి శ్రీనాథ్, విస్తరణాధికారి నల్లి రవికుమార్, ఆశ కార్యకర్తలు, ఆరోగ్యకేంద్రం సిబ్బంది ఉన్నారు.

సకాలంలో సర్వేలు పూర్తి చేయకుంటే చర్యలు

పాతపట్నం ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నిర్ధేశిత సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని, లేకుంటే చర్యలు తప్పవని మండలప్రత్యేకాధికారి మంచు కరుణాకరరావు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో మేజర్ పంచాయతీ పాతపట్నం పరిధిలోని మూడు సచివాలయాల సిబ్బందితో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. సమీక్షలో ఎంపీడీవో పి.చంద్రకుమారి, ట్రాన్స్‌కో సిబ్బంది, పాతపట్నం ఈవో వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అండర్-23 క్రికెట్ పోటీలకు హరీష్ ఎంపిక

హిరమండలం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): గొట్ట గ్రామానికి చెందిన బత్తుల హరీష్ ఏప్రిల్‌లో శ్రీలంకలో జరగనున్న అండర్-23 క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల తెలంగాణలో జరిగిన ఎంపికల్లో హరీష్ ఎంపికయ్యాడు. ఈ మేరకు స్నేహితులు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.


హరీష్

6 నుంచి ఎల్లమ్మతల్లి ఉత్సవాలు

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): చిన్నసాన గ్రామంలో ఈ నెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఎల్లమ్మతల్లి గ్రామదేవత ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త బోనేల ఎల్లయ్య రాములమ్మ తెలిపారు. తొలిరోజు ఊరేగింపు, అన్నదానం ఉంటుందని, మిగిలిన రెండు రోజులు కుంకుమపూజలు ఉంటాయన్నారు.

లోకేశ్ దృష్టికి నియోజకవర్గ సమస్యలు

పాతపట్నం/కొత్తూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ దృష్టికి నియోజకవర్గ సమస్యలు తీసుకెళ్లినట్టు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం అమరావతిలోని సచివాలయంలో జరిగిన టీడీఎల్‌పీ సమావేశంలో మంత్రిని కలిసి సమస్యలు వివరించినట్టు తెలిపారు.


లోకేశ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంజీఆర్

సాగునీటి వనరుల అభివృద్ధికి చర్యలు

పలాస, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో సాగునీటి వనరుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. ఈ మేరకు గురువారం అసెంబ్లీ ఆవరణలో జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలుసుకొని ఇక్కడున్న వనరుల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌కు నిధులు కేటాయించడంపై ఆమె మంత్రికి అభినందనలు తెలిపారు. మందస మండలంలో దామోదర్‌సాగర్, జంతిబంద మినీ రిజర్వాయర్‌కు నిధులు కేటాయించి రైతులకు సాగునీరు అందించాలని కోరారు.

యువతను సన్మార్గంలో నడిపించాలనే..

- నేడు బొడ్డపాడు యువజన సంఘం 71వ వార్షికోత్సవం
- రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఏర్పాట్లు


మాట్లాడుతున్న బొడ్డపాడు గ్రామపెద్దలు

పలాస రూరల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): యువతను సన్మార్గంలో నడిపించే లక్ష్యంతోనే 1954లో బొడ్డపాడు యువజన సంఘ ఏర్పాటు చేశారని, ఆ లక్ష్య సాధనతోనే నేటికి విజయవంతంగా ముందుకు సాగుతున్నట్టు ఆ సంఘ సభ్యులు తెలిపారు. పలాస మండలం బొడ్డపాడు గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. సంఘం ఏర్పడి 71 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాలు, రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అమర వీరుల స్మారక మైదానంలో ఈ పోటీలకు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు తామాడ త్రిలోచనరావు, కిక్కర డిల్లీరావు, దాసరి శ్రీరాములు, తామాడ కిరణ్,తులసీరావు పాల్గొన్నారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

పలాస, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ కె.మల్లికార్జునరావు, ఎస్‌ఐ ఎస్‌కే సైదా హెచ్చరించారు. శాసనంలో గురువారం రాత్రి చేపట్టిన దాడుల్లో కుప్పిలి గణేష్ ఏడు లీటర్ల సారాతో పట్టుబ డినట్టు తెలిపారు.

అమర జవాన్ కుటుంబానికి రివార్డు

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): చెట్లతాండ్ర గ్రామానికి చెందిన అమరజవాన్ దొక్కరి రాజేష్ కుటుంబానికి రూ.5 లక్షల రివార్డు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. జమ్మూ కశ్మీర్‌లో గతేడాది జూలై 15న జరిగిన ఉగ్రవాదుల దాడిలో గాయపడి రాజేష్ మృతి చెందాడు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి అతడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సిక్కోలు.. ఇక అభివృద్ధి పథం

(ఐదో పేజీ తరువాయి)

నుంచే 'తల్లికి వందనం' పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ ఏడాదిలోనే ప్రతి కుటుంబానికి రూ.25లక్షల ఆరోగ్య బీమా పథకం అందుబాటులోకి రానుంది. ఏప్రిల్ ఒకటి నుంచి మున్సిపాలిటీల బిల్లుల చెల్లింపునకు కేంద్రీకృత విధానం నుంచి వేరు చేసి బిల్లులు చెల్లించే అధికారాన్ని మున్సిపాలిటీలకే ఇస్తున్నారు. దీంతో ఎప్పటిపనులకు అప్పుడే బిల్లుల చెల్లింపు జరుగుతుంది. ఇక సొంత ఇంటి నిర్మాణానికిగాను షెడ్యూల్ కులాల వారికి అదనంగా రూ.50వేలు, షెడ్యూల్ తెగల వారికి రూ. 75వేలు అదనంగా ఆర్థిక సహాయం ప్రభుత్వం ఇవ్వనుంది. ఈఏడాది జూన్ నాటికి టిడ్కో ఇళ్లను పూర్తిచేసి అందించనున్నారు. ఆమదాలవలస, శ్రీకాకుళం (పాత్రునివలస), ఇచ్ఛాపురం, పలాస పట్టణ ప్రజలకు లబ్ధి కలగనుంది. అలాగే చంద్రన్నబీమా పథకం అమలుకు సంబంధించి విధివిధానాలు నిర్ణయిం చేందుకు వర్కింగ్ కమిటీ ఏర్పాటు చేశారు. దీనిపై అసంఘటిత కార్మికులకు త్వరలో ప్రయోజనం కలగనుంది. ఇక శ్రీకాకుళంలో ఈఎస్‌ఐ ఆసుపత్రి నిర్మాణానికి భూముల గుర్తింపు జరిగినట్లు బడ్జెట్ సమావేశంలో ప్రకటించారు. ఇలా బడ్జెట్‌లో అన్ని వర్గాలకు సమన్యాయం జరిగిందని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఆఫ్‌షోర్ కల సాకారం..



గత ఐదేళ్ల వైసీపీ హయాంలో ఆఫ్‌షోర్ గురించి పట్టించుకోలేదు. కనీసం అభివృద్ధి పనులు ప్రారంభించలేదు. కలగానే మిగిలిపోతుందని భావించాం. కూటమి ప్రభుత్వం తొలివిడతలో కాంట్రాక్టరుకు రూ.30 కోట్లు చెల్లించింది. ఇప్పుడు మలివిడతగా రూ. 90 కోట్లు కేటాయించింది. దీనివల్ల ఆఫ్‌షోర్ కల నెరవేరుతుంది. అటు వ్యవసాయ పరంగా జిల్లాకు ప్రాధాన్యం లభించింది.

- గౌతు శిరీష, పలాస ఎమ్మెల్యే

నెరవేరుతున్న హామీలు



కూటమి నేతలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొటీ నెరవేరుస్తున్నారు. వంశధార ఫేజ్2కు ఏకంగా రూ. 182 కోట్లు కేటాయించడం చిన్న విషయం కాదు. ఈ ఏడాది విద్యా సంవత్సరం నుంచే తల్లికి వందనం అమలుకానుంది. రైతులకు భారీ ప్రయోజనం కల్పించేలా బడ్జెట్‌లో ప్రతి విషయాన్ని చేర్చారు. కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు.

- కలమట వెంకటరమణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

వైసీపీకి ఈ బడ్జెట్ సమాధానం



జిల్లాకు ఏవిధమైన అభివృద్ధి జరగలేదని.. నిధులు విడుదల చేయడంలేదని సోషల్ మీడియా వేదికగా వైసీపీ పేటీఎం బ్యాచ్ తెగ దుష్ప్రచారం చేస్తోంది. ఇప్పుడు రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆలోచనలతో మరింతగా నిధులు కేటాయించారు. ఈ బడ్జెట్.. వైసీపీ పేటీఎం బ్యాచ్‌కు సమాధానం. జిల్లా ప్రజలు కూడా ఇదే చర్చిస్తున్నారు.

- పిసిని చంద్రమోహన్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు

పరిశ్రమలకు ప్రోత్సాహక బడ్జెట్



ఎచ్చెర్ల: పరిశ్రమలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, పేదరిక నిర్మూలన, స్వచ్ఛాంధ్ర వంటి లక్ష్యాలతో బడ్జెట్‌ను రూపొందించారు. స్టార్టప్‌లకు మద్దతు, ఇంధన మౌలిక వనరుల సంరక్షణ తదితర రంగాలకు ప్రత్యేక నిధుల కేటాయింపు బాగుంది. గ్రీన్ ఆంధ్ర-ప్రణాళిక పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు మద్దతు ద్వారా ఈ బడ్జెట్ రాష్ట్ర ఆర్థిక స్థిరత్వాన్ని మెరుగుపరిచేలా ఉంది.

- డాక్టర్ ఎంపీ సూరి గణేష్, ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్

రైతుల తరపున కృతజ్ఞతలు



ఐదేళ్ల తర్వాత జిల్లాలో సాగునీటి రంగానికి మళ్లీ ప్రాధాన్యం దక్కింది. వంశధార ఫేజ్-2, ఆఫ్‌షోర్ ప్రాజెక్టుకు నిధులు కేటాయించినందుకు రైతుల తరపున ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నా.

- సిరిపురం తేజేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

మూల ధనం పెంపు హర్షణీయం



కాశీబుగ్గ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో మూలధన వ్యయం రూ.32,712 కోట్లు కేటాయించడం సంతోషకరం. గత మూడేళ్లలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో కంటే ఇది ఎక్కువ. దీనివల్ల సంపద సృష్టించడానికి ఉపయోగపడుతుంది. పెట్టుబడులతో రెవెన్యూ.. తద్వారా ఆర్థికాభివృద్ధి మరింత పెరిగే అవకాశం ఉంది.

- బోసెల గోపాల్, ఏపీ ఎన్జీవోస్ అధ్యక్షుడు

ఇది సంక్షేమ బడ్జెట్



కాశీబుగ్గ: ఇది సంక్షేమ బడ్జెట్. ప్రధానంగా బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం సంతోషం. బడ్జెట్ బీసీల కోసం చేసిన కేటాయింపులు కూటమి ప్రభుత్వం బీసీలకు ఏ స్థాయి ప్రాధాన్యం ఇస్తుందో మరోసారి రుజువైంది. బీసీ సంక్షేమానికి రూ.47.456 కోట్లు, ఆదరణ పథకం కోసం రూ.1000 కోట్లు కేటాయించడం అభినందనీయం.

- దుర్గారావు, జనసేన పార్టీ పలాస సమన్వయకర్త

వ్యవసాయానికి ఊతం



టెక్కలి: వ్యవసాయ రంగానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వడం గొప్ప విషయం. రైతు పక్షపాతిగా బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయి. ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకాలకు, ఎన్టీఆర్ జలసిరికి, నీటివనరుల శాఖకు, వ్యవసాయ శాఖకు, ఎరువులకు అనేకరకాలుగా పెద్దఎత్తున నిధులు కేటాయించారు.

- బగాది శేషగిరి, టీడీపీ మండల అధ్యక్షుడు, టెక్కలి

రైతు సంక్షేమానికి పెద్దపీట



టెక్కలి: బడ్జెట్‌లో రైతు సంక్షేమానికి పెద్దపీట వేయడం అభినందనీయం. ఎన్నో ఎన్నాళ్ల నుంచి ఎదురుచూస్తున్న వ్యవసాయ పరికరాలకు బడ్జెట్‌లో రూ.219.65 కోట్లు కేటాయించడం, విత్తన రాయితీ పంపిణీకి రూ.240 కోట్లు, వడ్డీలేని రుణాలు కింద రూ.250కోట్లు, పంటల బీమాకు రూ.1,023 కోట్లు, పీఎం కిసాన్ యోజన పథకానికి రూ.9,400కోట్లు కేటాయించడం గొప్ప విషయం.

- పోలాకి షన్ముఖరావు, మండల తెలుగు రైతు విభాగం అధ్యక్షుడు

రాష్ట్ర భవిష్యత్ ఆవిష్కృతమైంది



హిరమండలం: ఈ బడ్జెట్ చరిత్రాత్మకంగా నిలిచిపోతుందని జడ్పీటీసీ పొగిరి బుచ్చిబాబు అన్నారు. రాష్ట్ర బడ్జెట్ రూ.3లక్షల కోట్లు దాటడం ఇదే తొలిసారి. సూపర్ సిక్స్ సహా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలుకు, అభివృద్ధికి సమప్రాధాన్యత ఇవ్వడం స్వర్ణాంధ్ర సాధనలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధిని ప్రతిబింబించేలా ఉంది. అన్న దాత సుఖీభవ కింద ప్రతి రైతుకు రూ.20వేలు, తల్లికి వందనం రూ.15 వేలుతో పాటు మత్స్యకార భరోసా రూ.20 వేలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయం హర్షణీయం. సంక్షేమం అభివృద్ధి సమ్మేళనంతో విజన్ 2047 ఆవిష్కరణకు ప్రివ్యూ మాదిరగా ఉంది.

- బుచ్చిబాబు, జడ్పీటీసీ హిరమండలం